శరవేగంగా తారురోడ్డు పనులు

- ఆనందం వ్యక్తం చేస్తున్న రావికమతం ప్రజలు



గుంతలమయంగా రోడ్డు (ఫైల్)



రోడ్డు పనుల్లో భాగంగా కాంక్రీట్ మిక్సర్ వేసి రోలింగ్ చేస్తున్న దృశ్యం

రావికమతం: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో మండల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. రావికమతంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డు, డ్రైనేజీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నర్సీపట్నం–భీమునిపట్నం రహదారిలో రావికమతం పెట్రోల్ బంకు నుంచి ఆర్టీసీ బస్సు స్టేషన్ వరకు తారురోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి ఈ నెల 12న పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. సదరు కాంట్రాక్టర్ గతంలో కాంట్రాక్టర్ మాదిరిగా గాక పనులు ప్రారంభం నుంచి దగ్గరుండి పర్యవేక్షిస్తూ ఎక్కువ యంత్రాలను ఉపయోగించి త్వరితగతిన చేపడుతున్నాడు. గతుకుల రోడ్డును తవ్వి రోలింగ్ చేసి ఆపై కాంక్రీట్ మిక్సర్ వేస్తున్నాడు. త్వరితగతిన పనులు పూర్తవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కాంట్రాక్టరు జాప్యం..

రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి చోడవరం మండలం గంధవరం వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.104 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. ఈ పనులకు సంబంధించి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాడు. రోడ్డు పనులు చేయకుండా ఎడతెగని జాప్యం చేయడంపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పలుమార్లు అతడి వైఖరిపై బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ స్పందించి రావికమతం, కొత్తకోట, రోలుగుంట వంటి ముఖ్యమైన గ్రామాల్లో సిమెంటు, తారురోడ్డుతోపాటు డ్రైనేజీల నిర్మాణానికి రూ.12.5 కోట్లు ప్రత్యేక గ్రాంటుగా మంజూరు చేయించారు. ఆ నిధులలో రావికమతంలో పనులకు రూ.1.40 కోట్లు మంజూరు చేయించి వేరొక కాంట్రాక్టర్ ఆ పనులను అప్పగించడంతో చకచకా సాగుతున్నాయి.

క్లుప్తంగా

శస్త్రచికిత్సలకు 46 మంది ఎంపిక



శస్త్రచికిత్సలకు విశాఖ తరలిస్తున్న దృశ్యం

రావికమతం: మేడివాడలో గురువారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామ యువకుడు పతివాడ ధనంజయ్ ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. 122 మందిని పరీక్షించారు. వీరిలో 46 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఏరియా కోర్డినేటర్ అరుణ్‌కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు వేయింగ్ మెషీన్ వితరణ

రావికమతం: మరుపాక మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించుకున్న విద్యార్థి కాశెట్టి హేమసాగర్ వేయింగ్ మెషీన్‌ను గురువారం వితరణగా అందించాడు. ఇది ఇక్కడ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ సత్యసునీల్ ఈ సందర్భంగా తెలిపారు. హేమసాగర్‌ను అభినందించారు.

సామరస్య పూర్వకంగా మెలగాలి



పాఠశాల ఆవరణలో మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ తమ తోటి వారితో సామరస్య పూర్వకంగా మెలగాలని హెచ్ఎం. నాగేశ్వరరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎల్.వి.నారాయణరావు తెలిపారు. ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని గొండుపాలెం హైస్కూల్ ఆవరణలో గురువారం వారు మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘర్షణలకు దూరంగా ఉంటూ శాంతిని అందరూ కోరుకోవాలన్నారు. ప్రపంచ దేశాలు ఇదే కోరుకుంటాయని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు రమేష్, తారకేశ్వరి పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కొత్తకోట భజన బృందం



కీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు

రావికమతం: తిరుమల–తిరుపతి శ్రీవారి సాలగ్రామ బ్రహ్మోత్సవాల్లో కొత్తకోట గ్రామానికి చెందిన ఆనంద నిలయ భజన మండలి మహిళల బృందం పలు పురందాస కీర్తనలు ఆలపించింది. ఈ నెల 19 నుంచి రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు అక్కడ నిర్వహించారు. దాస సాహిత్య ప్రాజెక్టు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో భజన మండలి గురువు చుండూరు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో కీర్తనలు ఆలపించి ఆకట్టుకుంది. ఆనంద నిలయ భజన మండలి సభ్యులు పెనుగొండ శోభారాణి, సునీత తదితరులు స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా గురువారం గ్రామస్తులు వారిని అభినందించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న చైర్మన్, ఉపాధ్యాయినులు

మాకవరపాలెం: పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ కృషి చేయాలని కేజీబీవీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్.నారాయణమూర్తి, ఎస్‌వో త్రివేణి కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్న నాడే పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

29న ఉపకరణాలకు ఎంపిక శిబిరం



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలు ఉచితంగా అందించేందుకు ఈ నెల 29న నర్సీపట్నంలో ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించనున్నామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ నర్సీపట్నం పెదబొడ్డేపల్లి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో గుర్తించిన వారికి ఉచితంగా ఉపకరణాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సదరం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు రేషన్‌కార్డు లేదా ఓటరు ఐడీ కార్డు, రెండు పాస్‌సైజు ఫొటోలు వెంట తీసుకువెళ్లాలన్నారు. అదేవిధంగా ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతుందన్నారు. సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో 18 గిరిజన గ్రామాల్లో ఆఫ్‌లైన్ సర్వే చేయాలని కలెక్టరు ఆదేశించారన్నారు. కార్యాలయ పారిపాలన అధికారి పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సంపూర్ణ గృహ హక్కు

వైస్ ఎంపీపీ రాజారామ్



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: నిరుపేదలను ఆదుకోవడానికే జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని వైస్ ఎంపీపీ రాజారామ్ అన్నారు. గురువారం ఎల్.గవరవరం గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇంత వరకు పలువురు నిర్మించుకున్న ఇళ్లకు గ్రామంలో స్థలాలకు పట్టాలు లేవన్నారు. ఇప్పుడు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో భాగంగా ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి వెచ్చా రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మేడిచర్ల హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఎంఈవో సత్యనారాయణ



పాఠ్యాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు: పాఠశాల నిర్వహణ సమయంతో పాటు పది విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులను నిర్వహించాలని ఎంఈవో సత్యనారాయణ ఆదేశించారు. గురువారం ఆయన మేడిచర్ల హైస్కూల్‌ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు పూర్తయిన పాఠ్యాంశాల్లో పలు ప్రశ్నలు వేసి పది విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రతీ విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉదయం 9 నుంచి 10, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. వీటితోపాటు బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జి.శివానంద పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఎంపీపీ సుర్ల రాజేశ్వరి



డ్వాక్రా మహిళలకు కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: ప్రభుత్వ తోడ్పాటుతో స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా రాణించాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి తెలిపారు. గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో లబ్ధిదారులకు కోళ్ల యూనిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఒక్కొక్క గ్రామ సంఘానికి 11 నుంచి 25 కోళ్లను అందజేశారు. కిచెన్ గార్డెన్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్ రూ.3,950 ఉంటుందన్నారు. నాటు కోళ్లతోపాటు, కిచెన్ గార్డెన్ పెంపకం ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారంతోపాటు ఆర్థికంగా రాణించగలరన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పార్వతి, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రమణబాబు, ఎంఎల్‌వో చంద్రశేఖర్, పార్టీ నాయకులు ఇన్నం రత్నం, సీసీలు రామలక్ష్మి, జగదీష్, అకౌంటెంట్ శాంతి పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ



రైతులకు పాసు పుస్తకాలను అందజేస్తున్న ఈర్లె అనురాధ, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షతో రైతులకు ఎన్నోయేళ్ల నాటి భూ సమస్యలకు మోక్షం కలిగిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ అధ్యక్షతన గురువారం ములకలాపల్లిలో భూ రీసర్వే పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావులతో కలిసి అనురాధ రైతులకు వీటిని అందజేశారు. వెరసి తొలి విడతగా గ్రామంలో 764 మందికి పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. ఎంపీటీసీ మజ్జి దేవి, గొర్లె కొండలరావు, మజ్జి రాజు, ఉప సర్పంచ్ కర్రి బలరాం, సచివాలయ కన్వీనర్ మైచర్ల నారాయణరావు, మాజీ ఎంపీటీసీ కర్రి సాంబ, మజ్జి అప్పల సత్యం, గొర్లె ధనుంజయ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు ఆధ్వర్యంలో గురువారం బోయిలకింతాడలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు 87 మందికి నేత్ర పరీక్షలు చేసి, వీరిలో 39 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 110 మందికి మెడికవర్ వైద్యులు సాధారణ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

అన్నసమారాధన

కె.కోటపాడు: చౌడువాడలో శిలపరశెట్టి వారి వీధి వినాయక మండపం వద్ద గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా అన్నసమారాధన నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం

చోడవరం రూరల్: సరదా కోసం చేసే సహ విద్యార్థుల ర్యాగింగ్ కారణంగా తమ అమూల్యమైన భవిష్యత్‌కు ప్రధాన అవరోధంగా మారుతుందన్న సత్యాన్ని గుర్తెరిగి కళాశాల జీవితాన్ని ఆస్వాదించాలని చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు ఉద్బోధించారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ సహా ఇతర చట్టాల పట్ల అవగాహన కల్పించారు. యాంటీ ర్యాగింగ్ చట్టం తీవ్రతను ఆ మేరకు నేరం రుజువైనట్టయితే పడే శిక్షలను వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తాగునీరు వృథా



ట్యాపులు బిగించక వృథాగా పోతున్న నీటిలో చిన్నారి స్నానం

బుచ్చెయ్యపేట: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కరక గ్రామంలో తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడ తీవ్ర మంచినీటి ఎద్దడి ఉండటంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి సరఫరాకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వాటితో కాంట్రాక్టరు గ్రామ శివారులో మంచినీటి పథకం ట్యాంకు నుంచి గ్రామంలో ఇంటింటికీ పైపులైన్ వేశారు. కుళాయి కనెక్షన్ ఇచ్చి ఐదు నెలలుగా ట్యాపులు బిగించకుండా వదిలేశారు. దాంతో ట్యాంకు నుంచి వస్తున్న నీరు వృథాగా పోవడమే కాక గ్రామమంతా బురదమయంగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. దిగువ ప్రాంతంలో వారికి నీరందగా, ఎగువ ప్రాంతంలో వారికి సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే ట్యాపులు బిగించి గ్రామస్తులందరికీ తాగునీరు అందేలా చేయాలని గ్రామానికి చెందిన గొన్నాబత్తుల మణి, యన్నెంశెట్టి పరదేశి కోరుతున్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

చోడవరం రూరల్: చోడవరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శుక్ర, శనివారాలలో జరగనున్నాయి. ఇటీవల వివిధ మండలాల్లో అండర్ –14, 17 బాల బాలికల విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించిన విషయం విదితమే. వీటిలో ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని నియోజకవర్గ కో ఆర్డినేటర్ బి.కన్నంనాయుడు కోరారు. శుక్రవారం ఉదయం చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. వీటిని లక్కవరం హైస్కూలు పీడీ ఎస్.అప్పలనాయుడు పర్యవేక్షిస్తారన్నారు.

చీడికాడలో..

చీడికాడ: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం ఉదయం నుంచి స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రారంభించనున్నట్లు ఎంఈవో బొంజుబాబు తెలిపారు. ఈ పోటీలను ఉదయం 9.30 గంటలకు పాఠశాల ఆవరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. నియోజకవర్గంలోని చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల, కె.కోటపాడు మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు.

వినాయకుడికి విశేష పూజలు



రోలుగుంటలో అభిషేకాలు చేస్తున్న వినాయక మాలధారులు

రోలుగుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధ, గురు వారాలు రోలుగుంట, శరభవరం, కంచుగుమల తదితర గ్రామాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో రోలుగుంట వినాయక ఆలయం ఆవరణలో విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. భక్తులతోపాటు ఇక్కడ వినాయక మాలలు ధరించిన వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వినాయక చవితి ప్రారంభం నుంచి రోజూ ఉదయం, రాత్రిళ్లు భక్తి కీర్తనలతో ఇక్కడ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

- లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ బాధితుడికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గణేష్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కాలేయ వ్యాధితో బాధపడుతున్న మున్సిపాలిటీ బలిఘట్టం 17వ వార్డుకు చెందిన పారుపల్లి అప్పలస్వామినాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరైంది. ఈ మొత్తం చెక్కును అమరావతి సచివాలయ ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అందజేశారు. బాధితుడు అప్పలస్వామి నాయుడు లివర్(కాలేయం) సంబంధిత సిర్రోసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్ వైద్యులను సంప్రదించగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. బాధిత కుటుంబం స్థానిక పార్టీ నాయకులను ఆశ్రయించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యేకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గుడబండి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



ఎం. కోటపాడులో పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు



వీరనారాయణంలో పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొండప్పారావు

మాడుగుల రూరల్: రైతులు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు తెలిపారు. ఎం.కోటపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష కార్యక్రమంలో భాగంగా ఎం. కోటపాడు, ఎం.కె.వల్లాపురం గ్రామాలకు చెందిన 600 మంది రైతులకు మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్ శానాపతి శేషఫణి, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, ఎం.కె.వల్లాపురం సర్పంచ్ కోట్ని లక్ష్మి, ఉప సర్పంచ్ కరణం రాము, వీఆర్వో పి. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తిరుమలదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరనారాయణంలో...

వీరనారాయణంలో 400 మందికి పట్టాదారు పాసు పుస్తకాలను సర్పంచ్ యల్లపు కొండప్పారావు పంపిణీ చేశారు. వీఆర్వో కె. రవిరాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దాడి నూకరత్నం, మహేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు విస్సారావు రామారావు, పంచాయతీ కార్యదర్శి ఇ. శంకర్, సీఈవో తురుబిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సాంఘిక పరివర్తనకు గురజాడ కృషి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గురజాడ చిత్రపటానికి పూలమాలను వేస్తున్న గ్రంథపాలకురాలు పద్మావతి



గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో

మాకవరపాలెం: సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు గురజాడ ఎనలేని కృషి చేశారని ఎంఈవో మూర్తి అన్నారు. గురువారం జంగాలపల్లి పాఠశాలలో గురజాడ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోతోపాటు ఉపాధ్యాయులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ సమాజంలో ఉన్న దురాచారాలను ఎండగడుతూ కన్యాశుల్కం, కన్యక, దిద్దుబాటు, పుత్తడిబొమ్మ, తదితర రచనలు అందించారన్నారు. హెచ్ఎం రామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికమతం: మహాకవి, నవయుగ వైతాళికుడు గురజాడ వెంకట అప్పారావు జయంతి సందర్భంగా పి.కొట్నాబిల్లి పాఠశాలలో ఆ మహనీయుని చిత్రపటానికి సీఆర్ఎంటీ(సీఆర్పీ) గుంటూరు రామారావు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. తన రచనలు ద్వారా సాంఘిక పరివర్తనకు ఎంతగానో ప్రయత్నించారని సీఆర్పీ వివరించారు.

కె.కోటపాడు: మహా కవి గురజాడ అప్పారావు తన రచనలతో సాంఘిక పరివర్తనకు కృషి చేశారని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు. విద్యార్థులతో కలిసి గురువారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఆయన ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషల్లోనే రచనలు చేశారని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఆయన రచనల్లో కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు.

రైతు సంఘం కలెక్షన్ సెంటర్ భవనానికి రూ.11.25 లక్షలు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు

చోడవరం రూరల్: సిద్ధి ఫల రైతు సంఘానికి కలెక్షన్ సెంటర్ భవన నిర్మాణానికి ఉద్యానవన శాఖ రూ.11.25 లక్షలు మంజూరైనట్టు సంఘం అధ్యక్షుడు తాళపురెడ్డి సత్యవీరునాయుడు తెలిపారు. సంఘం నాల్గో వార్షికోత్సవాన్ని గురువారం లక్ష్మీపురం పాల ఉత్పత్తిదారుల తులసీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఏర్పాటయ్యాక మండలంలోని పది గ్రామాలకు చెందిన 583 మంది రైతులు సభ్యులుగా చేరారన్నారు. సంఘం నిర్వహణతో ఉద్యానశాఖ రైతులకు ఉపయోగకరమైన గోదాము నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కలెక్షన్ సెంటర్ ద్వారా రైతులు పండించిన సేంద్రియ ఉత్పత్తులను నిల్వ చేసుకుని మంచి ధరకు విక్రయించుకుని అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. సీఈవో ఎన్.ఎస్.నాయుడు సంఘం వార్షిక నివేదికను చదివి వినిపించారు. సబ్బవరానికి చెందిన జాగృతి సంస్థ ఎండీ కె.సుజాత రైతు సంఘం చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. సర్పంచ్ సిరిసోళ్ల ఆది గణపతినాయుడు, మాజీ సర్పంచ్ ఎస్.సత్యారావు, ఏఏవో కె.ఫణీంద్ర, సంఘ డైరెక్టర్లు పాల్గొన్నారు.